




# సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229








ప్రచురణ: హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 14 ఎడిటర్ : పాలగోని రాజేష్ సోమవారం -10 -03-2025 పేజీలు : 8 వెల : 4-00


## మార్చి 14న పవన్ చేయబోయే
# ప్రకటనపై టెన్షన్.. టెన్షన్

**జనసేన నేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 14వ తేదీన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ప్రసంగించనున్నారు**



అమరావతి, **సూర్యటుడే న్యూస్,** పిఠాపురం నియోజకవర్గంలో ఈ ప్లీనరీకి సంబంధించిన ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు పిఠాపురం తరలి వచ్చే అవకాశముంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి ప్లీనరీ కావడంతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు వస్తారని భావించి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం నేతలకు పవన్ కల్యాణ్ బాధ్యతలను అప్పగించారు. ఎక్కడా దూరం ప్రాంతం నుంచి వచ్చిన కార్యకర్తలకు, నేతలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి...

అయితే మార్చి 14వ తేదీన జరిగే ప్లీనరీలో పార్టీ అధినేతగా పవన్ కల్యాణ్ కీలక ప్రకటన చేసే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లో 21అసెంబ్లీ స్థానాలను,రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి వంద శాతం విజయం సాధించిన జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే దిశగా ఈ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కార్యాచరణను రూపొందించనున్నారని తెలిసింది. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని, పదవులు కూడా వస్తాయని, నామినేటెడ్ పదవుల నుంచి అన్ని పదవులు రావాలంటే నిజాయితీగా, నిక్కచ్చిగా పార్టీ సిద్ధాంతాలకు లోబడి పనిచేయాలని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా నేతలకు, కార్యకర్తలకు ఒక సందేశం ఇచ్చేందుకు రెడీ అవుతున్నారని చెబుతున్నారు.

కష్టపడిన వారికే పదవులు...

రానున్న పదవుల్లో కష్టపడిన నేతలకే ప్రాధాన్యత ఇస్తామన్న హామీని పవన్ కల్యాణ్ ఇవ్వనున్నారు. మూడు పార్టీలు కలసి పనిచేయాలని, ఇందుకోసం ఇగోలకు పోకుండా, అలాగని పార్టీ ప్రయోజనాలు పణంగా పెట్టకుండా జనంలోకి జెండాను తీసుకెళ్లాలని పవన్ కల్యాణ్ కార్యకర్తలకు సూచించనున్నారు. రాజకీయ భవిష్యత్ చాలా ఉందని, మరో ఇరవై ఏళ్ల పాటు తాను రాజకీయాల్లో ఉంటానని, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి వారిని గౌరవిస్తామని కూడా పవన్ కల్యాణ్ చెప్పనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకోసం ముందుగా ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో కార్యకర్తలను నేతలను కలుపుకుని వెళుతూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరనున్నారు

వివాదాలకు గురైన నేతలను...

మరొక వైపు నేతలకు వార్నింగ్ కూడా ఇవ్వనున్నారు. ఎలాంటి వివాదాలకు వెళ్లవద్దని, అలా వెళ్లిన వారిని నిర్దాక్షిణ్యంగా పార్టీకి దూరంగా ఉంచుతామని కూడా పవన్ కల్యాణ్ ఈ ప్లీనరీ ద్వారా హెచ్చరించనున్నారు. అనేక చోట్ల టీడీపీ, జనసేన నేతలకు మధ్య విభేదాలున్నాయన్న విషయాన్ని కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించి, ఏదైనా సమస్యలుంటే పార్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే తాను నేరుగా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్న హామీ కూడా ఇవ్వనున్నారు. ఇక గెలిచిన ఎమ్మెల్యేలు కొందరిపై అప్పుడే ఆరోపణలు వస్తున్నాయని, వాటిని తొలగించుకుని మరోసారి గెలుపునకు ప్రయత్నించాలని కూడా పిలుపునివ్వనున్నారని పార్టీ ముఖ్య నేతలు చెప్పారు. మొత్తం మీద మార్చి 14న పవన్ కల్యాణ్ ప్రసంగంపైనే నేతలు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## నేడు గ్రూప్-1 ఫలితాలు విడుదల




హైదరాబాద్: **సాయి సూర్య**తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్స్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. గ్రూప్-1 ఫలితాలు (Results) సోమవారం విడుదల కానున్నాయి. 563 గ్రూప్-1 సర్వీసుల పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల్లో అభ్యర్థుల ప్రాథమిక మార్కుల (Preliminary Marks) వివరాలు ఈరోజు టీజీపీఎస్సీ (TGPSC) వెల్లడించనుంది. అలాగే మంగళవారం గ్రూప్ 2 పరీక్షల జనరల్ ర్యాంకింగ్స్... 14న గ్రూప్ 3 పరీక్షల జనరల్ ర్యాంకింగ్స్‌ను విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది.కాగా గ్రూప్-1 ప్రధాన పరీక్షలకు 21,093 మంది హాజరయ్యారు. ఫలితాల వెల్లడిలో భాగంగా తొలుత ప్రధాన పరీక్షల మార్కుల ప్రకటనతో గ్రూప్-1 తుది నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ తరువాత అభ్యర్థుల నుంచి రీకౌంటింగ్ ఆప్షన్లు స్వీకరించి, ఆ ప్రక్రియ ముగిసిన అనంతరం 1:2 నిష్పత్తిలో జాబితా వెల్లడించనుంది. అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్లో పొందుపర చనున్నట్లు కమిషన్ తెలిపింది

## ప్రతిపక్షంపై కక్ష.. విద్యార్థులపై వివక్ష..

- **ఇంటిగ్రేటెడ్ గురుకులాల కేటాయింపులో రేవంత్ మెలిక**
- **55 గురుకులాల్లో రెండు మాత్రమే కేటాయింపు**
- **కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు 90%నిధులు**
- **అధికారులతో ముఖ్యమంత్రే జీవో ఇప్పించారని భట్టి వ్యాఖ్యలు**



హైదరాబాద్, **సాయి సూర్య** తెలంగాణలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుత న్నాయి. వీటిలో 50 గురుకులాలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు చెందిన అసెంబ్లీ నియోజకవర్గాలకు గురుకులాలు కేటాయించక పోవడంపై ప్రజలు, ప్రతిపక్షనేతలు మండిపడుతున్నారు.బీఆర్ఎస్‌కు ప్రస్తుతం 28 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలున్నారు. వాటిలో ఆసిఫాబాద్, మేడ్చల్ నియోజకవర్గాలకు మాత్రమే గురుకులాలు కేటాయించారు. ఎంఐఎం, సీపీఐ, బీజేపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు కేటాయించారు

. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు వెలువరించింది. ఒక్కో గురుకులానికి రూ.200 కోట్ల చొప్పున మొత్తం 11,000 కోట్లు విడుదల చేసినట్టు పేర్కొంది. మరోవైపు మినిస్టర్ క్వార్టర్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంక టర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి డిప్యూటీసీఎంభట్టివిక్రమార్కవివరాలు వెల్లడించారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా
# విజయశాంతి, అద్దంకి, శంకర్‌నాయక్



- **ఎమ్మెల్యే కోటా అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం**
- **ఒక సీటు మిత్రపక్షం సీపీఐకి కేటాయింపు**
- **అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ సామాజిక న్యాయం**
- **ఎస్సీ, ఎస్టీతోపాటు మహిళకు సీటు కేటాయింపు**
- **అనూహ్యంగా తెరపైకి రాములమ్మ పేరు**
- **ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకే అవకాశం!**
- **అద్దంకి దయాకర్‌కు ఎట్టకేలకు దక్కిన చాన్స్**
- **శంకర్‌నాయక్‌కు సీనియర్ నేతలందరి మద్దతు**
- **అంతా సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన వారే!**
- **నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు**

హైదరాబాద్/న్యూఢిల్లీ/నల్లగొండ/**సాయి సూర్య** కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠకు తెర పడింది. అయితే అనూహ్యంగా పార్టీ ఫైర్ బ్రాండ్ విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, సుదీర్ఘకాలంగా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. ఒక సీటును మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. ఈ మేరకు ప్రతిపాదనను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు) ప్రకటించారు. మొత్తం ఐదు సీట్లకు ఎన్నికలు జరుగుతుండగా.. పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి నాలుగు సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్.. అందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మిత్రధర్మంలో భాగంగా ఆ పార్టీకి ఇచ్చింది. మొత్తంగా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీతోపాటు ఒక మహిళకు అవకాశం కల్పించింది.

## నేటి నుంచే పార్లమెంటురెండో
# విడత బడ్జెట్ సమావేశాలు

- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు లోక్‌సభ ఆమోదం కోరనున్న అమిత్ షా
- మణిపూర్, వక్ఫ్ బిల్లుపై సర్కారును నిలదీయనున్న ప్రతిపక్షాలు
- నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రంపైనా ఆందోళన



న్యూఢిల్లీ, **సాయి సూర్య** పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలు ఉన్నాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మ?ధ్య తొలి రోజు నుంచే వాగ్యుద్ధాలు జరగనున్నాయి. హింసాకాండతో అతలాకుతలమైన మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనకూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారమే లోక్‌సభ ఆమోదముద్ర కోరనున్నారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మణిపూర్‌కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టబోతున్నారు. ఇక ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు కూడా ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు రానుంది. మణిపూర్‌లో రెండేళ్లుగా జరుగుతున్న హింసను అదుపు చేయలేక.. గత నెలలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో రాజీనామా చేయించి, రాష్ట్రపతి పాలన విధించాల్సి రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మణిపూర్‌లో హింసాకాండ ఆగకపోవడంపై సర్కారును నిలదీయనున్నాయి. మరోవైపు వక్ఫ్ బిల్లును పరిశీలించేందుకు వేసిన సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ)లో తమ అభ్యంతరాలను తిరస్కరించి కేవలం ఎన్డీయే సభ్యుల ఆమోదంతో బిల్లుకు ఆమోదముద్ర వేసినందుకు ప్రతిపక్ష సభ్యులు గత సమావేశాల్లోనే గందరగోళం సృష్టించారు.

## 15 వ వార్డు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదలు.



తుర్కయంజాల్,సూర్య టుడే : మొదటిసారిగా ఏర్పడిన తుర్కయంజాల్ మున్సిపల్ పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ గా వేముల స్వాతి అమరేందర్ రెడ్డి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జె ఎన్ ఎన్ యు ఆర్ ఎమ్ కాలనీవాసులు సన్మానం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గా మొట్ట మొదటి సారిగా తనను గెలిపించిన వార్డు ప్రజలకు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డి ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేశారు.మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గా తన గెలుపు కృషి చేసిన వార్డు ప్రజలకు తను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మాజీ కౌన్సిలర్ స్వాతి అమరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,నర్సింగ్,రవితేజ, రాములు,గణేష్, కృష్ణ,అప్పారావు, మల్లేష్,నర్సింహులు, చెన్నమ్మ,యాదమ్మ, రాములమ్మ,అంజమ్మ, తేజమ్మ,లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ విశాలాంధ్ర రిపోర్టర్ శ్రీనివాస్ ఆకస్మిక మరణం



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 9గత 15 సంవత్సరాలుగా పలు పత్రికలలో పనిచేసి ప్రస్తుతం తుర్కయంజాల్ విశాలాంధ్ర పాత్రికేయునిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఆదివారం ఆకస్మిక మరణం చెందారు. విషయం తెలుసుకున్న తుర్కయంజాల్ జర్నలిస్ట్ కాలనీ సోదరులు హుటా హుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన మరణం తీరని లోటని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, నియోజకవర్గ జర్నలిస్టు సంఘం టి యు డబ్ల్యూ జే 143 సంఘం అధ్యక్షుడు సురమోని సత్యనారాయణ తో పాటు వర్కింగ్ జర్నలిస్టు సోదరులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయన ఆకస్మిక మరణం పట్ల దిగ్భ్రాంతి చెందారు. ఒక సీనియర్ జర్నలిస్టు ఆకస్మిక మరణం బాధాకరమని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తుర్కయంజాల్ జర్నలిస్టు కాలనీలో సోమవారం మధ్యాహ్నం సమయంలో అంత్యక్రియలు జరుగుతాయని అంతిమయాత్రకు హాజరుకావాలని కుటుంబ సభ్యులు, కాలనీ జర్నలి సోదరులు తెలిపారు.

## మున్సిపల్ అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలి.

**కళ్యాణ మండపం ప్రారంభించిన ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగా రెడ్డి.**





తుర్కయంజాల్-సూర్య టుడే:తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి రాగన్నగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో ని పార్క్ స్థలంలో చలసాని రాజేంద్రప్రసాద్ సొంత నిధులతో నిర్మించిన కళ్యాణ మండపాని స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, రోడ్డు రవాణా డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి తో కలిసి ఆదివారం ప్రారంభించారు. సొంత నిధులు రూ.1.15 కోట్ల తో కళ్యాణ మండపము నిర్మించిన చలసాని రాజేందర్ ను ఎమ్మెల్యే అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉన్నారు.
కాలనీవాసులు కళ్యాణ మండపాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మజీ వైస్ చైర్ పర్సన్ గుండ్ల పల్లి హరిత ధన్ రాజ్ గౌడ్,
టి. పి. సీ.సి సభ్యులు కాకుమాన్ సునీల్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, మాజీ కౌన్సిలర్ రేవల్లి హరిత యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ బీం రెడ్డి, పూజారి శంకరయ్య, పరుచూరి రాజేంద్ర ప్రసాద్, దాసరి సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమంలో టీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు సురమోని సత్యనారాయణ పాత్ర ఎనలేనిది

- తెలంగాణ ఉద్యమంలో వార్తలు చేరవేయడంలో ముఖ్యపాత్ర
- నేడు టి యు డబ్ల్యూజె143 నియోజకవర్గ అధ్యక్షుడు, సీనియర్ టీవీ5 జర్నలిస్టు సురమోని సత్యనారాయణ జన్మదినం.
- సత్యనారాయణకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పట్నం జర్నలిస్టు సోదరులు.

ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి
జర్నలిజం అనేది ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని, అందరం కలిసి పనిచేసినప్పుడే ప్రజలకు మేలు చేయగలుగుతామని టి యు డబ్ల్యూ జే (వన్ ఫోర్ త్రీ) ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు సురమోని సత్యనారాయణ అన్నారు. వార్తల సేకరణలో వాటిని ప్రచురించడంలో జర్నలిస్టుల కృషి మరువలేనిదని, ప్రతి జర్నలిస్టుకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఇండ్ల స్థలాలు మంజూరు చేయటానికి కృషి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 119 నియోజకవర్గాల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 100% జర్నలిస్టులకు ప్లాట్లు వచ్చేలా కృషి చేశానన్నారు. గత ప్రభుత్వాలకంటే తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. జర్నలిజం చేసి, ఎల్ఎల్ బిలో పట్టబద్ధుడై పూర్తి సమయం చేపట్టి బాధ్యతను విస్మరించకుండా జర్నలిస్టుల కోసం ప్రతి మండలంలో యూనియన్ ప్రెస్క్లబ్లు ఏర్పాటుకు కృషి కృషి చేసానన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తూ వారికి అండగా ప్రభుత్వంతోపాటు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఉందన్నారు. టీయూడబ్ల్యూజే యూనియన్ ఏర్పడిన అనతి కాలంలోనే సంఘం పెద్దలతో మాట్లాడి అక్రిడేషన్లు వచ్చేలా కృషి చేసి జర్నలిస్టులకు పింఛన్లు, వారి పిల్లలకు పాఠశాల ఫీజులల్లో రాయితీ, వివిధ కారణాలతో మృతి చెందిన ప్రతి జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసి ప్రత్యేక పాత్ర పోషించారు.బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చొరవతో నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ ప్లాట్లు వచ్చేలా కృషి చేశారు. అదేవిధంగా కరోనా మహమ్మారి కబళించి వేస్తున్న సమయంలో దాతల సహకారంతో సంఘం తరఫున కరోనా బారిన పడిన జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు, తగిన ఔషధాలు, తగిన జాగ్రత్తలు తెలిపి జర్నలిస్టు సోదరులకు అండగా నిలిచారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం త్వరలోనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయించే లక్ష్యంగా పనిచేసి ప్రతి సోదరునికి న్యాయం చేకూరేలా కృషి చేస్తానని ఒక ప్రకటనలో తెలిపారు.
రంగారెడ్డి జిల్లాలో లక్ష్మీ దేవమ్మ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జర్నలిస్టుల మహాసభకు కరోనాతో మృతి చెందిన నమస్తేతెలంగాణ ఆదిబట్ల రిపోర్టర్ బృంగి శశివర్ణం పేరును నామకరణం చేసి, టి యు డబ్ల్యూ జే 143 జెండా ఆవిష్కరణ చేసిన విషయంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. జర్నలిస్టులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తీర్చడంలో ముందుంటారు సురమోని సత్యనారాయణ. స్నేహశీలి, మృదు స్వభావి ఉప్పొంగిన ఉత్తేజంతో



ఇలాగే ముందుకు సాగాలని కోరుతూ నేడు సురమోని సత్యనారాయణ జన్మదినం సందర్భంగా జర్నలిస్టు సంఘం సోదరుల తరఫున ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## కస్తాలలో త్రాగునీరు సమస్యను పరిష్కరించాలి

**సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ**




చండూర్ మార్చి 9 (సూర్య టుడే):
కస్తాల గ్రామంలో తాగునీరు సమస్యను పరిష్కరించాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు. ఆదివారం చండూరు మండల పరిధిలోని కస్తాల గ్రామంలో సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామములో ప్రజలు మంచినీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారని ఆయన అన్నారు. ఒక్క ట్యాంకర్ కు 800 రూపాయల నుండి వెయ్యి రూపాయల వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి తమ ట్యాంకులోకి నింపుకుని వాడుకుంటున్నామని ఆ గ్రామ ప్రజలు తమ ఆవేదనను సిపిఎం నాయకులకు వెలిబుచ్చారు. చండూరులో పైపులైను పగిలి సుమారు వారం రోజులు కావస్తున్నా అధికారులు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో దాదాపు ఆ గ్రామం అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఒకపక్క గ్రామంలో త్రాగునీరు సమస్యతో అల్లాడుతుంటే మరోపక్క పొట్ట కొచ్చిన వరి పంటకు నీరు లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా తెప్పించుకొని పంటను కాపాడుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ గ్రామంలో ఉన్న మాధవరావు చెరువులో ఉన్నటువంటి బోరును రిపేరింగ్ చేస్తే కొంత తాగునీరు సమస్య పరిష్కారమవుతాయని ఆ గ్రామ ప్రజలు తమ ఆవేదనను సిపిఎం సర్వే బృందానికి తెలియజేశారని ఆయన అన్నారు. బీసీ కాలనీలో ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంకును కొన్ని సంవత్సరాల నుండి శుభ్రం చేయడం లేదని, ఆ ట్యాంకు లీకేజ్ అవుతుందని తెలుస్తుందన్నారు. చాలామంది నిరుపేదలు రేషన్ కార్డుల కోసం, పింఛన్ల కోసం, ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. కస్తాల గ్రామంలో ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ఆ గ్రామంలో ఉన్న ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాగునీరు సమస్యను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, ఈరటి వెంకటయ్య, వెంకటేశం, గ్రామ ప్రజలు సరిపల్లి రమేష్, అనిమల్ల వెంకటేష్, రాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

భారతదేశంలో బంగారం ధరలు గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులు అవుతున్నాయి. కానీ వెండి ధరలు మాత్రం కొంత స్థిరంగా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నిర్ణయాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా అమెరికా డాలర్ విలువ పెరగడం, వడ్డీ రేట్ల మార్పు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో నేడు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

## అంగరంగ వైభవంగా పెద్ద కాపర్తి శ్రీ శ్రీ శ్రీ తిరుమలనాథ స్వామి కళ్యాణ మహోత్సవం




చండూర్ మార్చి 9 (సూర్య టుడే): ఆదివారం రోజు చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ తిరుమలనాథ స్వామి (గుట్ట )బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రోజు అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం, స్థానిక పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తో కలిసి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాల్లో పాల్గొనడం జరిగింది. అనంతరం వారిని శాలువ తో సన్మానించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్ మాదిగ, ఆలయ కమిటీ చైర్మన్ ఓర్సు రాజు, గ్రామ ప్రముఖులు కాటం వెంకటేష్, నీలకంఠం లింగస్వామి, సాగర్ల నాగరాజు, ఏర్పుల దామోదర్, చింతకింది అజయ్ , ఎర్పుల నరసింహ, పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొనడం జరిగింది.

## యువత వ్యాపారంలో రాణించాలి మన ఊరు హోటల్ నూతనంగా ప్రారంభం జిల్లా అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి వస్కుల శ్రీనయ్య



కొండమల్లేపల్లి సాయి సూర్య న్యూస్ మార్చి 9యువత వ్యాపారంలో రాణించాలని ఖమ్మం జిల్లా అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి వస్కుల శ్రీనయ్య అన్నారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని హైదరాబాదు రోడ్డులో కొత్తబావి స్టేజ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మన ఊరి హోటల్ ను పసునూరి యుగేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రాకులాడకుండా తన సొంత కాళ్లపై వ్యాపారంలో రాణించాలన్నారు. తనదైన శైలిలో లాభాలు గణించి పదిమందికి దారి చూపేలా ఎదగాలన్నారు. హోటలకు వచ్చిన కస్టమర్లకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసునూరి యుగంధర్ రెడ్డి ,మారం నారాయణరెడ్డి, మాడుగుల యాదగిరి, కొడిదాల వెంకటయ్య, బొడ్డుపల్లి దశరథం, విప్పలపల్లి జితేందర్ యాదవ్ ,జబ్బు యాదయ్య, రమావత్ దస్రు నాయక్, బొడ్డుపల్లి సత్యం, కిన్నెర యాదయ్య, వెంకటయ్య, బొడ్డుపల్లి మల్లేష్, హోటల్ నిర్వాహకులు వస్కుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తెలుగు దిన పత్రిక
సోమవారం 10 మార్చి 2025

## ఎన్ ఎస్ యు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా గోపలి పవన్ కుమార్ ఎంపిక



యాచారం సూర్య న్యూస్ (మార్చి 09):. మండల పరిధిలో కురుమిద్ద గ్రామానికి చెందిన ఎన్ ఎస్ యు కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా గోపలి పవన్ కుమార్ ఆదివారం నియమితు లయ్యారు. అనం తరం ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం సేవకుడిగా కృషి చేస్తానని అన్నారు. నా మీద నమ్మకంతో సోషల్ మీడియా కన్వీనర్ గా బాధ్యతలు ఇచ్చినందుకు కాంగ్రెస్ నాయకులకు, యువజన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్ ఎస్ యు ఐ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా కుకుడాల నరేందర్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 9
కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ ఎస్ యు ఐ(నేషనల్ స్టూడెంట్ యూనియన్ అఫ్ ఇండియా ) తెలంగాణ సోషల్ మీడియా చైర్మన్ కామిరెడ్డి శశాంక్ ఆధ్వర్యంలో ఇటీవలే వివిధ జిల్లాలకు ఎన్ ఎస్ యుఐ మీడియా కోఆర్డినేటర్లను నియమించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల్ నుండి కుకుడాల నరేందర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గానియమించడం జరిగింది. ఆదివారం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి నరేందర్ రెడ్డిని శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతు పార్టీ లో కష్టపడ్డవారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాత్తిరి ఎల్లేష్, గ్రామశాఖ అధ్యక్షార్యదర్శిలు రావుల భాషయ్య, రమేష్, మాజీ సర్పంచ్ సుంకరిపండారి గౌడ్, ఆనంగళ్ల యాదయ్య, మాజీ ఎంపీటీసీ కావాలి శ్రీనివాస్, కావాలి బుగ్గరాములు,గుడ్డిమల్ల చంద్రయ్య మాసయ్య గౌడ్, మార సురేష్, బుట్టి కృష్ణ, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రావుల నాగరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దసరామోని అశోక్, శంకర్, రైనా ముదిరాజ్, మంకు ప్రవీణ్, చీరాల జంగయ్య, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**– గురువులను సన్మానించిన పూర్వవిద్యార్థులు.**



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 9
చింతపల్లి మండలం గడియాగౌరారంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005-06 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆరు నుండి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 19 ఏళ్ళ తర్వాత ఒకేచోట కలుసుకొని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. నాటి గురువులు నేర్పిన చదువుతో పాటు క్రమశిక్షణ వల్లన నేడు ఒక్కొక్కరు ఒక్కోస్థాయిలో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి,ఉపాధ్యాయులు యాదయ్య,రవి కుమార్,మండల విద్యధికారి, పూర్వవిద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# అనాథ విద్యార్థులకు బాల గ్రామ్ సేవలు

**-రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్**
**-పేద విద్యార్థుల పట్ల నిరంతరం సేవలు**
**-500 మంది విద్యార్థులు స్థిరపడ్డారని అభినందన**
**-బాల గ్రామ్ సంస్థ అందరికీ ఆదర్శం**
**-ఘనంగా బాల గ్రామ సంస్థ 40 వ వార్షికోత్సవం వేడుకలు**







యాచారం సూర్య న్యూస్ ( మార్చి 09):. అనాధ పేదలను, ఆదరిస్తూ చేరదీస్తున్న బాల గ్రామ్స్ సేవలు నిరంతరం కొనసాగించడం పేద విద్యార్థుల పట్ల, సేవా దృక్పథంతో సేవ చేయడం ద్వారా అనాథలపై మరింత బాధ్యత పెరుగుతుందని గీ వర్గీ స్ మార్ యు హానోస్ మార్ అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలో తక్కల్లపల్లి తండా గ్రామపంచాయతీ సమీపంలో గ్రీగోరియస్ బాల గ్రామ్ లో డైరెక్టర్ తామస్ కుట్టి రాంబన్ ఆధ్వర్యంలో ఘనంగా బాలగ్రామ్ సంస్థ 40 వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా.. శ్రీ వర్గీస్ మార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ వార్షికోత్సవంలో మాట్లాడారు. నిర్వాకులను శాల్వాతో సన్మానించారు. ప్రేమే మార్గం, సేవే లక్ష్యంగా ఎంచుకొని తెలంగాణ ఆంధ్రాలో అనేకమంది పేద పిల్లల్ని అనాథల్ని గుర్తించి చిన్ననాటి నుంచి విద్యాభ్యాసంలో ప్రయోజకులుగా మార్చి, అనాథాల సేవ దృక్పథంతో బాలగ్రామ్ సంస్థ ఆదర్శంగా నిలిచిందని అన్నారు. బాల గ్రాము ద్వారా సుమారు 500 మంది విద్యార్థులు ఉన్నతమైన విద్యను అభ్యసించి, వారి వారి జీవితాల్లో ఉన్నతమైన ఉద్యోగాలలో పనిచేస్తున్నారు. వారు ఈ సంస్థకు అనేక విధాలుగా సహకరిస్తున్నారని గుర్తు చేశారు. పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారిని సన్మానించి అభినందన పత్రాలు బహుకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గీకి థామస్, బాల గ్రామ్ డైరెక్టర్ పప్పా, ప్రిన్సిపాల్ రిచల్, కంటి ఆస్పత్రి మేడం శెభ , కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంగోత్ వెంకటేష్, ఇటికాల లక్ష్మారెడ్డి, ముచ్చర్ల సంపత్, లిక్కి సుధాకర్ రెడ్డి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి

**పల్లె గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో పల్లె సుదర్శన్ గౌడ్ జ్ఞాపకర్థం క్రికెట్ టోర్నమెంట్.**






ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి,9
నీత్యం బిజీగా ఉండే వారికీ క్రీడలు మానసికోల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని, పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె గోపాల్ గౌడ్ అన్నారు. తండ్రి కీర్తి. శే. సదర్శన్ గౌడ్ జ్ఞాపకర్థంగా...గత 45రోజులుగా నిర్వహిస్తున్న పల్లె ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -8 ఆదివారం రోజున చివరి ఆట ఆడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజాన్ రెడ్డి హాజరై బాహుమతులు అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో 10జట్లు పాల్గొన్నగా ఇందులో మొదటి బహుమతి మహాత్మ యూత్ అసోసియేషన్ 46వేలు,గెలుపొందగా,రెండో బాహుమతి యువ చైత్యన్య యూత్ అసోసియేషన్ 28వేల బాహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా పల్లె గోపాల్ గౌడ్ మాట్లాడుతూ... యువతంటే మార్పును ఆశించే నవతరం. అవకాశాలను అందిపుచ్చుకొని భవితకు బాటలు వేసుకునే శక్తి. యువత తలుచుకుంటే ఏదైనా సాధించే ఆత్మవిశ్వాసం వారి సొంతం అవుతుందని. కొందరు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటుండగా మరికొందరు చెడు వ్యసనాలకు బానిసలై పెడదోవ పడుతున్నారు.ముఖ్యంగా యువత క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని, ప్రతిఒక్కరూ ఆటలు ఆడుతూ మానసిక, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆటల్లోగెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా స్పూర్తితో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతిరోజు చదువుకునే వారికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడంతో వారిలో నూతనోత్తేజాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజాన్ రెడ్డి ముఖ్య అతిధులుగా గెలుపొందిన వారికి బాహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కోరె జంగయ్య, రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రజిని కాంత్, పాండు రంగారెడ్డి, రవి గ్రామ పెద్దలు,రవి గౌడ్,యువకులు ప్రవీణ్ గౌడ్, మల్లేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనంలో తోటి పూర్వ విద్యార్థినికి ఆర్థిక సహాయం

**విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానం.**



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి9చింతపల్లి మండలం కురుమేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈఆత్మీయ సమ్మేళనానికి గురువులు నరసింహారెడ్డి, లక్ష్మణరావు, బ్రహ్మచారి, హనుమ రాజు, రాజ్య నాయ క్ లను సాదరంగా ఆహ్వానించారు. పూర్వ విద్యార్థులు ముద్దం రవీందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, పరమేష్ యాదవ్, అంజయ్య, సురేందర్, లక్ష్మీనారాయణ రామకృష్ణ బాబు మరియు అలివేలు, వనజ, ప్రేమలత ఇంకా కొంతమంది పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి హాజరై అన్నబోయినపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బాణాల జంగమ్మ భర్త అనారోగ్య కారణంగా మరణించడం వల్ల ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుందన్న విషయం తెలుసుకొని పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు కలిసి 65 వేల రూపాయలు ఆర్థిక సహాయం అక్కడనే శక్తి కొలది సమకూర్చుకొని గురువుల చేతుల మీదుగా అందించడం జరిగింది. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలతో సన్మానించి పాదాభివందనం చేశారు.

## యువజన రంగానికి రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలి

**పల్లె మధు కృష్ణ, గడ్డం వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు**




చండూర్ మార్చి 9 (సూర్య టుడే): రాష్ట్ర ప్రభుత్వం 2025 - 2026 సంవత్సర బడ్జెట్ లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధు కృష్ణ, గడ్డం వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక కందాల రంగారెడ్డి భవనంలో గుడ్డేటి సూర్జిత్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువజన రంగానికి ఈ సంవత్సరం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని ఎన్నికల మేనిఫెస్టోలో రంగారెడ్డి జిల్లా వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకారం యువజన రంగానికి అన్ని రకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పి ఇప్పటివరకు డిక్లరేషన్ లో ఉన్న ఏ ఒక్క అంశాన్ని కూడా అమలు చేసిన పరిస్థితి లేదని వారు అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్న నూతన పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి కల్పన చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వారు అన్నారు. యువతకు క్రీడా రంగానికి రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించడం వల్ల నిరుద్యోగ శాతాన్ని తగ్గించి ఉపాధి కల్పనకు తోడ్పడుతుందని వారు సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లా శాసనసభ్యులు యువజన రంగంపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి బడ్జెట్లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక
సోమవారం 10 మార్చి 2025

# ఏపీ మహిళలపై తమిళనాడు మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

**ఏపీ, బీహార్ మహిళలకు ఇప్పటికీ విద్యా హక్కు లేదన్న మంత్రి దొరై మురుగన్**
**తండ్రై పెరియార్ పోరాటాల వల్ల తమిళనాడు మహిళలకు విద్యా హక్కు సాధ్యమైందన్న మంత్రి**
**మహిళా దినోత్సవం సందర్భంగా వ్యాఖ్యలు**




తమిళనాడు జలవనరుల శాఖ మంత్రి దురై మురుగన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏపీ, బీహార్ తదితర రాష్ట్రాల్లో మహిళలకు ఇప్పటికీ విద్యా హక్కు లేదని పేర్కొన్నారు. కానీ, తమిళనాడులో తండ్రై పెరియార్ పోరాటాల ఫలితంగా మహిళలకు విద్యా హక్కు సాధ్యమైందని చెప్పారు. ఆ కారణంగా రాష్ట్రంలో మహిళలు పురోగతి సాధిస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తమిళనాడు, కేరళలో మహిళల విద్యకు తండ్రై పెరియార్ పోరాటాలు చేసి మార్గదర్శిగా నిలిచారని, రాష్ట్రంలో తొలి వైద్యురాలిగా ముత్తులక్ష్మీరెడ్డి రికార్డులకెక్కారని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల్లో మాత్రం ఇప్పటి వరకు మహిళలకు విద్యాహక్కు లేదని మంత్రి దొరై మురుగన్ వ్యాఖ్యానించారు.

# రెండో రోజు కొనసాగిన నిరాశ

**అరసవెల్లిలో సూర్యకిరణ స్పర్శకు ఆటంకం**
**రెండో రోజు నిరాశతో భక్తుల తిరుగుముఖం**
**పొగమంచు, మేఘాలే కారణం**
**ఉత్తరాయణ, దక్షిణాయణంలో కిరణ స్పర్శ ఆనవాయితీ**
**ఆదివారం రూ. 8.54 లక్షల ఆదాయం**



శ్రీకాకుళం జిల్లాలోని అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించిన భక్తులకు వరుసగా రెండో రోజు కూడా నిరాశ ఎదురైంది. సోమవారం ఉదయం కూడా సూర్యకిరణాలు స్వామివారి మూలవిరాట్‌ను తాకలేకపోయాయి. ప్రతి సంవత్సరం రెండుసార్లు జరిగే ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అయితే పొగమంచు, మేఘాలు ఆటంకం కలిగించాయి. ఆదివారం కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో భక్తులు నిరాశతో వెనుదిరిగారు. ఉత్తరాయణ, దక్షిణాయణ కాలాల్లో మార్పుల సమయంలో, ప్రతి సంవత్సరం మార్చి 9, 10 మరియు అక్టోబర్ 1, 2 తేదీల్లో సూర్యకిరణాలు స్వామివారి విగ్రహాన్ని తాకడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సెలవు దినం కావడంతో, సూర్యకిరణాలు స్వామివారిని తాకుతాయని భావించి వేలాదిగా భక్తులు ఉదయం 6 గంటలకే ఆలయానికి చేరుకున్నారు. భక్తులు సూర్యకిరణాల కోసం వేచి చూసినప్పటికీ, మేఘాల కారణంగా కిరణ స్పర్శ జరగలేదు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని, ఇంద్ర పుష్కరిణిలో స్నానాలు ఆచరించి, రావిచెట్టుకు పూజలు చేశారు. కొందరు భక్తులు క్షీరాన్నం వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం ఒక్కరోజే ఆలయానికి రూ. 8,54,950 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

# కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ..



కెనడా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మార్క్ కార్నీ లిబరల్ పార్టీ నాయకుడిగా ఎన్నికై, కెనడా 24వ ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. దీంతో, జస్టిన్ ట్రూడో 9 ఏళ్ల పాలనకు ముగింపు పలికారు. మార్క్ కార్నీ లిబరల్ పార్టీ నాయకత్వ పోటీలో 131,674 ఓట్లతో గెలిచారు. ఇది మొత్తం పోలైన 85.9% బ్యాలెట్లకు సమానం. ఈ పోటీలో ఆయన ప్రత్యర్థులు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు.

క్రిస్టియా ఫ్రీలాండ్ 11,134 ఓట్లు
కరీనా గౌల్డ్ 4,785 ఓట్లు
ఫ్రాంక్ బేలిస్ 4,038 ఓట్లు

ఈ భారీ విజయంతో కార్నీ లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతలను త్వరలో చేపట్టనున్నారు. ఆయనకు ఆర్థిక రంగంలో అపారమైన అనుభవం ఉండటంతోపాటు కెనడా ప్రజలు ఆయన పాలనపై చాలా ఆశలు పెట్టుకున్నారని చెప్పవచ్చు.

వ్యక్తిగత జీవితం

మార్క్ జోసెఫ్ కార్నీ 1965 మార్చి 16న నార్త్‌వెస్ట్ టెరిటోరీస్‌లోని ఫోర్ట్ స్మిత్‌లో జన్మించారు. అల్బెర్టాలోని ఎడ్మంటన్‌లో పెరిగిన కార్నీ, హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీని 1988లో పొందారు. తరువాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో 1993లో మాస్టర్స్, 1995లో డాక్టరేట్ డిగ్రీలను సాధించారు.

వృత్తి ప్రస్థానం

కార్నీ తన వృత్తి జీవితాన్ని గోల్డ్‌మన్ సాచ్స్‌లో ప్రారంభించి, వివిధ కీలక పదవుల్లో పనిచేశారు

2004లో, కార్నీ కెనడా ఫైనాన్స్ డిపార్ట్‌మెంటులో సీనియర్ అసోసియేట్ డిప్యూటీ మినిస్టర్‌గా వర్క్ చేశారు

2008 నుంచి 2013 వరకు, కార్నీ కెనడా బ్యాంక్ 8వ గవర్నర్‌గా సేవలందించారు. ఆ సమయంలో 2008 ఆర్థిక సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నారు

2013 నుంచి 2020 వరకు, కార్నీ ఇంగ్లాండ్ బ్యాంక్ 120వ గవర్నర్‌గా కూడా పనిచేశారు. బ్రెగ్జిట్, కోవిడ్-19 మహమ్మారి సమయంలో బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను నడిపించారు

కార్నీ 2011 నుంచి 2018 వరకు ఫైనాన్షియల్ స్టెబిలిటీ బోర్డ్ ఛైర్మన్‌గా, అలాగే యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ యాక్షన్ ఫైనాన్స్ స్పెషల్ ఎన్వాయ్‌గా సేవలందించారు

రాజకీయ ప్రస్థానం

కార్నీ 2024లో లిబరల్ పార్టీకి ఆర్థిక సలహాదారుగా చేరారు. 2025 జనవరిలో ఆయన లిబరల్ పార్టీ నాయకత్వ పోటీలో పాల్గొని, మార్చి 9న 86% ఓట్లతో విజయం సాధించారు.

వ్యక్తిగత జీవితం

కార్నీ భార్య డయానా ఫాక్స్ కాగా, వీరికి నాలుగురు కుమార్తెలు ఉన్నారు. కార్నీ క్రీడల్లో ఆసక్తి చూపిస్తూ హాకీ, రగ్బీ వంటి ఆటల్లో పాల్గొంటారు.

సవాళ్లు, భవిష్యత్

కార్నీ ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించిన తరువాత, కెనడా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం, క్లైమేట్ చేంజ్ సమస్యలను పరిష్కరించడం, అంతర్జాతీయ సంబంధాలను బలోపేతం చేయడం వంటి సవాళ్లను ఎదుర్కొనున్నారు. ఆయన ఆర్థిక పరిజ్ఞానం, అనుభవం కెనడా అభివృద్ధికి ఉపయోగపడుతాయని అక్కడి ప్రజలు భావిస్తున్నారు.

## బి.ఆర్. ఎస్. పార్టీ నాయకులపై, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతే ఊరుకునేది లేదు

– బర్రిగెల నగేష్ న్యాయవాది



చండూర్ మార్చి 9 (సూర్య టుడే): బి ఆర్ ఎస్ పార్టీ నాయకులపైన, కార్యకర్తలపైన తప్పుడు కేసులను ఖండించిన మునుగోడు నియోజకవర్గం లీగల్ సెల్ ఇన్చార్జి బరిగెల నగేష్ న్యాయవాది. ఆదివారం రోజు చండూర్ మండలం కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ నాయకులపైన, కార్యకర్తలపైన తప్పుడు కేసులు పెడుతు మా పార్టీ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని లీగల్ సెల్ ఇన్చార్జి బరిగెల నగేష్ ఆవేదన వ్యక్తం చేసినారు. అదేవిధంగా బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా తమ కార్యకర్తలను కాపాడుకుంట్టుందని, మునుగోడు నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాలలో బి ఆర్ ఎస్ లీగల్ సెల్ ఈ సమావేశాలను నిర్వహించి నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఇర్గి రామన్న, ఇర్గి రామకృష్ణ, శంకరా చారి, మహేష్, ఇర్గి వెంకటేశం పాల్గొన్నారు.

## చండూర్ మాజీ కౌన్సిలర్ ను ఘనంగా సన్మానించిన- దేవాలయ కమిటీ సభ్యులు



చండూర్ మార్చి 9 (సూర్య టుడే): నల్గొండ నియోజకవర్గం కనగల్ మండలం పరిధిలోని రెగట్టే గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్న చండూరు మున్సిపాలిటీ ఒకటవ వార్డు కౌన్సిలర్, సన్ షైన్ అధినేత కోడి వెంకన్న ను స్వామి వారి కళ్యాణం అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ అనుభవం లేని వ్యక్తికి కెనడా పగ్గాలు

- అధికార లిబరల్ పార్టీ చీఫ్‌గా ఎన్నికైన మార్క్ కార్నీ
- గతంలో బ్యాంక్ ఆఫ్ కెనడా గవర్నర్‌గా పనిచేసిన మార్క్
- 1.5 లక్షల మంది పార్టీ సభ్యుల్లో 1.31 మంది ఓటు ఆయనకే
- త్వరలోనే కెనడా 24వ ప్రధానిగా బాధ్యతలు




కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో 9 ఏళ్ల పాలనకు తెరపడింది. తాను ప్రధాని పదవి నుంచి వైదొలగనున్నట్టు ఈ ఏడాది జనవరిలో ట్రూడో ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికార లిబరల్ పార్టీకి నూతన సారథి ఎన్నిక అనివార్యమైంది. దీంతో బ్యాంక్ ఆఫ్ కెనడా మాజీ గవర్నర్ మార్క్ కార్నీ(59)ని పార్టీ తమ నూతన సారథిగా ఎన్నుకుంది. పార్టీ కొత్త చీఫ్‌గా ఎన్నికైన ఆయన త్వరలోనే ప్రధాని బాధ్యతలు చేపడతారు. ఈ ఎన్నికలో మొత్తం 1.5 లక్షల మంది పార్టీ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కార్నీకు 1,31,674 ఓట్లు రాగా, రెండో స్థానంలో ఉన్న క్రిస్టియా ఫ్రీలాండ్‌కు 11,134 ఓట్లు, కరినా గౌల్డ్‌కు 4,785 ఓట్లు, ఫ్రాంక్ బేలిస్‌కు 4,038 ఓట్లు వచ్చాయి. పార్టీ సారథిగా ఎన్నికైన కార్నీ కెనడా 24వ ప్రధానిగా బాధ్యతలు చేపడతారు. కాగా, ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయని, క్యాబినెట్‌లో పనిచేసిన అనుభవం లేని కార్నీ ప్రధాని కాబోతుండటం విశేషం.